# అత్తయ్యా ఆదరణ

'పసుపులేటి'

మొన్నటి శెలవులకు నా అభీష్టానికి విభిన్నంగా పట్టణాన్ని వదిలి పల్లెకు పోవలసివచ్చింది. ఒకవిధంగా అంతే. కాని, ఒకవిధంగా సంతోషం కలుగకపోలేదు. ఎన్నివాళ్ళనుండో గ్రామాలలోని గ్రామీణత్వాన్ని చవి చూడాలని కలలు కన్నాను. నా మనోరథం నేటికి నెరవేరింది.

పెళ్ళి, బెడ్డింగూ సర్ది పదిమైళ్ళ దూరంలో నున్న "మావూరు" వెళ్ళాను, బస్సుమీద. ఎప్పటినుండో మామయ్య పోరు పెట్టున్నాడు; నన్ను ఒక్కసారి రమ్మంటూ. సరే అంటూ ఆయన వీలైక స్పృహ పాలనానికి సమ్మతించి, వెంటనే వెళ్ళాను.

బస్సు దగ్గరకు మామయ్య మనిషిని పంపాడు. వాడు మామయ్య ఆఫీసులోని జవాను. వాడి పేరు తిరుపతి. ఆఫీసు బంట్రోతైనా యింటిలోని ఒక వ్యక్తిగా వ్యవహరిస్తూంటాడు. తిరుపతి నమ్మకస్తుడు; పిల్లలు గలవాడూను.

నేను బస్సు దిగగానే వాడు నన్ను చూసి గుర్తుపట్టాడు.

"బాబుగారూ... ఈడ... ఈడకు రండి. అగరా... వాటెందుకయ్యా, నేను మోసుకొస్తానుగదా. మీరు వేరే కూలీ దండుగెందుకు, నేనుండగా" అంటూ బస్సులోని సామాను తను తీసికుని బరువుగా, సంతోషంగా, వినయంగా ముందుకు దారి తీశాడు. వాడి కోరకకు సంతోషమేసింది. అనుసరించాను వాణ్ని.

పల్లెలో నడుస్తూనే వున్నానుగాని నా బుర్రలో పట్నవాసపు ఆలోచనలు పూర్తిగా వదల్లేదు.

దారివెంబడి వస్తూనే తిరుపతి ఏవో కబుర్లూ కథలూ చెప్పుకొస్తున్నాడు. నేను యథాలాపంగా 'ఊ' కొడ్తున్నాను. వాడికి, ఒక కొడుకు, నలుగురు ఆడపిల్లలూనట. వచ్చే జీతం చాలక నానా అవస్థలూ పడ్తున్నట్లు చెప్తున్నాడు. మోసే ఈ బరువు చాలక, ఆ మతిలేని స్రష్ట తనకు మరొక జీవిని ప్రసాదించబోతున్నాడట. సంక్షిప్తంగా వాడి నివేదనలోని ఆవేదన నా మస్తిష్కంలో కాస్త చోటు చేసుకుంది. ఇంతట్లోకే మామయ్యగారి భవంతి సమీపించాము.

ఇంటిలోనికి అడుగెట్టాను. నడవా ఖాళీగా వుంది. లోపలికి దారితీశాను. అత్తయ్యా, పిల్లలూ హాల్లో ఒక మంచంమీద ఉపవిష్టులై వున్నారు. వాళ్ళకు ఎదురుగా ఒక స్థూలకాయురాలు విసనకర్రతో విసురుకుంటూ ఒక పేము కుర్చీలో కూర్చుని వుంది.

నన్ను పిల్లలు చూడగానే చుట్టుముట్టారు పెద్దగా గోలచేస్తూ. వాళ్ళకు బిళ్ళలూ, బిస్కట్లూ పంచాను. వాళ్లు, వాటిపైకి దండయాత్ర చేస్తూ, నన్ను వదిలేశారు.

పరాయి వ్యక్తి, అందులోనూ ఎవరో ఒక పెద్దగారు స్త్రీని చూసి నేను మొహమాటంగా లోపలికే వెళ్ళబోయాను. కాని, నన్ను చూసిన అత్తయ్య సంకోచించలేదు.

"ఒరేయ్, యిలా రారా. వాడేనండి మా అన్నయ్య కొడుకు. ఇంజనీరింగు చదువుతున్నాడు. చాలా తెలివైనవాడు. ప్రతియేడూ ఫస్టున వస్తాడు. పైగా పత్రికల్లో కథలు కూడా రాస్తూంటాడు," అంటూ నన్ను ఆకాశపుటంచుల కెత్తేస్తూ ఆవిడతో చెప్పటం మొదలుపెట్టింది అత్తయ్య.

ఆమెకు నమస్కారం చేసి ఒక్క ప్రక్క కూలబడక తప్పిందికాదు నాకు. ఏకాగ్రతగా తొంగిచూస్తున్నది. పసుపురంగు వెంకటగిరి జరీచీరతో, బంగారంవంటి రంగు రవికతో, నుదుట వెడల్పాటి కుంకుమరేఖతో, పసిమిరంగు దేహచ్ఛాయతో నామె మూర్తీభవించిన గౌరీదేవిలా వుంది. ఆమె మెడనిండుగా నగలు, ఆమె కూర్చున్న తీవీ, మాటల్లోని హుందాతనమూ ఆమె ధనికురాలని చెప్పక చెప్తూతున్నవి. కులీనురాలని, ఉన్నతవంశ సంజాతురాలని ఆమె తలపంకించే విధానంలో వెల్లడవుతున్నది.

వాళ్ళ ప్రక్కన కూర్చోవటం యిబ్బందిగానేవుంది. కాని భరించక తప్పలేదు. నా చూపులు మాత్రం ధూళి రేణువులను అణువణువునా శోధిస్తూన్నాయి. కనులు భూమి కప్పగించి వీనులు గాలికొదిలేశాను.

క్షణాలు గడిచాయి. నాకు కాఫీకోసరం నీళ్లు పెట్టింది పొయ్యిమీద అత్తయ్య. వాళ్లిద్దరూ పరస్పర మర్యాదలతో మాట్లాడుకుంటున్నారు.

కాఫీకి నీళ్లు మరిగాయి. పద్నాలుగు పౌనుల కాఫీ పొడి డబ్బా ఒకటి బయటికి తెచ్చి, మూతతీసి చెమ్చాతో నాలుగుసార్లు పొడివేసింది నీళ్లలో. అది చూసింది ఆమె.

"ఏదో పెద్దడబ్బాలాగుందే!...ఎంతేమిటండీ?" అని అత్తయ్యను అడిగింది. ఒక బుగ్గమీద చేయివేసుకుంటూ విచిత్రంగా.

"అబ్బే, చాల తక్కువండీ. ముప్పైఎనిమిది రూపాయలే," అంది అత్తయ్య అదేదో లెక్కలోనిది కానట్లు.

ఆమె కనురెప్పలు ముడిచి కాస్త ఆశ్చర్యంగా అంది: "ఎలా భరిస్తున్నారండి మీరంత ఖర్చు?... కాఫీకి మీ రెక్కువ ప్రాముఖ్యత యిస్తారనుకుంటాను."

అత్తయ్య గర్వంగా నవ్వింది.

"అయినా, ఇది మాకు ఒకమూలకు రాదండి. నలుగురూ వచ్చిపోయే యిల్లు. ఆదరంగా వచ్చినవాళ్లకు, ఆప్యాయంగా కాఫీనీళ్లన్నా పోయకపోతే ఏంబాగుంటుందండి."

నాకూ, ఆమెకూ కాఫీ గ్లాసులు అందించింది. ఆమె తన గ్లాసుకేసి ఒక మాపుచూసి శూన్యానికేసి దృక్కులు బరిపింది.

"చల్లారిపోతుంది, తీసికోండి" అంటూ అత్తయ్య ఒక గ్లాసుతో పాలుతెచ్చి ఆమె గ్లాసు వెలితి నింపింది. నా గ్లాసు కాళీచేసి జారుకున్నా అక్కడనుండి.

ఒక అయిదు నిమిషాలైంది. రహస్యంగా బయట సిగరెట్టు పీల్చి, మంచినీళ్ళకని లోపలికొచ్చాను. నేను రావటం వాళ్ళు గమనించలేదు.

ఆమె అంటున్నది అత్తయ్యతో, "ఏమిటోనండీ! ఏమి లాభం; చెప్పండి. భూములున్నాయి. పట్నంలో మేడలున్నాయి. ఇక్కడ మిద్దెలున్నాయి. కాని ఎప్పటికప్పుడు చేయి తడుముకోవలసి వస్తూనేవున్నది. సంవత్సరాంతానికి ఫలసాయం రాదు. అద్దెలు సరిగా చేతికందవు, వాళ్ళకు అదొక జబ్బు."

అత్తయ్య తలాడిస్తూన్నది శ్రద్ధగా. ఏం మాట్లాడలేదు.

"అదిగో, ప్రాణం మీదికొచ్చింది. మీరు రెండు వందలు సర్దుతేగాని మా పరువు మర్యాదలు దక్కవు." అంటూ కొంతయ్యగారి కొంతమ్మ వాపోయింది. నా గుండెలు ద్రవించాయి, సుమా! చూడండి, ఎంత ఖర్చవటంలేదు! రోజూ ఒక పచ్చ నోటు తక్కువలేకుండా చేయి దాటుతూనేవున్నది. వెంటనే సంకోచించకుండా నా బొడ్డున దోపుకున్న నోట్లు యిచ్చి పంపేశాను!" అంటూ కాస్త ఊపిరి పీల్చుకునేందుకు ఆగింది.

అత్తయ్య నాగస్వరానికి తలూగించే నాగబాములా వుంది. నాకూ ఆమె మాటలు విన బుద్ధేసింది. గోడ ప్రక్కనే నిలబడ్డాను.

"ఆమెకు రెండు వందలూ యిచ్చి అలా పంపేనో లేదో, వారం వారం వచ్చే చీరలతను వచ్చాడు. అన్నీ కొత్త రకాలే. చూడగానే కొనాలనిపించింది. ఒక అర డజను చీరలు తీసేసుకున్నా. తీరా అతనికి డబ్బియ్యబోతే, తడుముకోవలసి వచ్చింది. లోపలికిపోయి యినప్పెట్టె తీయవలసి వచ్చింది." అంటూ ఆమె స్వోత్కర్ష సాగించింది.

వెంటనే అత్తయ్య అందుకొంది, "అక్కయ్యా, మాట మాత్రమైనా కబురంపారుగాదేమండీ. ఈరోజా చెక్కు మార్చుకొచ్చాను. మీకెంత కావాల్సినా నిరభ్యంతరంగా, నిక్షేపంగా పట్టుకెళ్ళేవారే." ఏదో కొంప మునిగినట్లుగా మాట్లాడింది అత్తయ్య.

తర్వాత వాళ్ళేమీ మాట్లాడుకున్నారో నాకు వినపడలేదు.

బాగా రాత్రయింది. తర్వాత మామయ్యగారు వచ్చారు. నేను [illegible] వచ్చినందుకు సంతోషాన్ని వెల్లడించాడు. కుశలప్రశ్నలు వేశాడు. అంతా కలిసి భోజనాలు చేసి, ప్రక్కలమీదికి చేరాము.

ఏదో ఆలోచిస్తూ ఎప్పుడు నిద్రపోయానో తెలియలేదు. కాని, అర్థరాత్రివేళ వీధి వాకిలి తలుపు చప్పుడుకు మెలకువ వచ్చింది. కొంతసేపు ఎక్కడో అని సందేహించి ఊరుకున్నాను. కాని, తలుపు బాదటం ఎక్కువైంది. దాంతో తప్పనిసరిగా లేచి వెళ్ళి తలుపు గడి తీశాను. ఎదురుగా కనిపించిన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాను. ఎవరో కాదు. తిరుపతి. మనిషి కంగారు పడుతున్నాడు. తడబడుతున్నాడు.

"అయ్యగోరూ, అమ్మగోరూ" అంటున్నాడు. నేను వాడిని చూసి లోపలికి గెంతి అత్తయ్యను లేపుకొచ్చాను నెమ్మదిగా.

"అమ్మగోరూ, మా ఆడది కష్టపడ్తూన్నదండి. దాని బాధ చూడలేకపోతున్నా" అన్నాడు ఆతృతగా, బాధగా.

"ఏమిటంటావు, అయితే? మంత్రసానిని తీసుకుపోరా? మా నిద్ర ఎందుకు చెడగొట్టావు?" అంది అత్తయ్య నిద్ర మత్తులో విసుగ్గా.

"అది కాదండి, అమ్మగోరూ...మంత్రసానమ్మ ఊళ్లో లేదండి ..పట్టణంనుండి డాకటేరుని తీసికు రమ్మంటున్నారండీ, చూసినోళ్లు" అన్నాడు తిరుపతి. బ్రతుకు మీద

ప్రీతితో. వాడి దీనమైన కళ్ళలో భీతీ, వేదనా స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అత్తయ్య ధోరణి వేరుగా వుంది.

"తీసికురా పోయి. మధ్య మా సలహా ఎందుకూ?" అంది నిర్లక్ష్యంగా.

"డాక్టరు బాబుకి డబ్బియ్యండే రారమ్మ గోరూ. నా కాడ చిల్లిగవ్వ లేదు. పది రూకలు సర్దండి అమ్మగోరూ, మీ మేలు మర్చిపోను" అంటూ చేతులు నలుపుకున్నాడు వాడి దీనత్వమూ, అసహాయతా చూస్తే ఎవరికైనా కళ్ళ నీళ్ళు తిరక్కమానవు.

"మా దగ్గిరెక్కడిదిరా? నీకు తెలియని దేముంది? చూస్తున్నావుగా! మేమే అన్నిటికీ అవస్తలు పడ్తున్నాము. ఏ ఒకటో రెండో అయితే సర్దగలం. ఇంకెక్కడైనా చూడు" అంది అత్తయ్య, ఉచితంగా సలహా కూడా యిస్తూ.

వాడికి కళ్ళల్లో ఆందోళన ఎక్కువైంది. వాడి సజల నేత్రాలలో, జనన మరణాలతో హోరాహోరి పోరాడే అర్థాంగి నొప్పులు ప్రతిబింబించినాయి.

ఒక్కసారిగా కూకటి వ్రేళ్ళతో పెళ్ళగించబడిన మహా వృక్షంలా అత్తయ్య పాదాలముందు కూలిపోయాడు.

"నే నేడకు పోయేదండి అమ్మగోరూ? మీరు తప్ప నా కెవరు దిక్కు? కాదనకండి అమ్మగోరూ. చచ్చి మీ కడుపున పుడతా. పుట్టే నా పిల్లకు మీ పేరెట్టుకుంటానండి. చాలా కష్టపడ్తున్నది, నా ఆడదాన్ని బ్రతికించండమ్మగోరూ, అమ్మగోరూ" అంటూ వాడు గోడు గోడున విలపించాడు. నా కడుపులో చేయి పెట్టి ఎవరో ప్రేవులు తోడుతున్నట్లైంది. గుండెలు ద్రవించాయి.

కాని...కాని, అత్తయ్యలో చలనం లేకపోయింది. స్థాణువులా నిలబడే వుంది.

"వెళ్లరా అబ్బీ, నాటు మంత్రసాను లెంతమంది లేరు. అందరకూ డాక్టర్లు కావాలంటే వస్తారా" అంటూ విసవిసా నడిచిపోయి, లోపల తలుపు వేసికుంది.

అత్తయ్య పలుకులు వాడి పాలిటి అశనిపాతాలై వాణ్ని దహించేశాయి. ఆమె నిరాదరణ, నిర్లక్ష్యమూ వాడి భావి జీవిత వృక్షానికి గొడ్డలిపెట్టు అయింది. వాడి ఆశా సౌధాలు పునాదులతో కూలిపోయాయి.

ఆమె పోయిన దిక్కుగా వెర్రిగా చూశాడు.

గబగబా వెళ్ళి, గోడకు వ్రేళ్లాడుతూన్న నా పాంటు జేబులో నుండి రెండు పది రూపాయల నోట్లు తీసి వాడి చేతిలో పెట్టాను.

అనుకోకుండా, ఆశించని ఊహించని విధంగా వచ్చి పడ్డ సహాయానికి వాడి హృదయ విహంగం రెక్కలు విప్పుకుంది. అంతవరకూ మూగపోయిన వాడి మనసు నిండా ఆనంద కాంతులు వెదజల్లాయి. సంతోషంతో బయటకు పరుగుతీశాడు. నా గుండెలు తేలికపడ్డాయి

అంతే. రెండు రోజులుండి బయలుదేరి వచ్చేశాను


## ది ఆంధ్రా బ్యాంకు లిమిటెడ్

హెడ్ ఆఫీసు: మచిలీపట్నం

అన్ని రకముల డిపాజిట్లపైనా
ఆకర్షణీయమైన వడ్డీలు ఇవ్వగలుగుటకు సంతసించుచున్నారు

సేవింగ్సు డిపాజిట్లు: నెలవారీ కనీసపు నిలువపైన 3%

ఫిక్సడ్ డిపాజిట్లు: 3 రోజులు నుండి 5 ఏళ్ల వరకూ వడ్డీ 3 1/2% నుండి 5% వరకు

3 మరియు 5 ఏళ్ల క్యాష్ సర్టిఫికెట్లు: ప్రతి రూ 100 సర్టిఫికెట్‌కు చెల్లించబడిన విలువలు రూ 88 మరియు రూ 80.

రికరింగ్ డిపాజిట్లు: నెలకు రూ 10 లు 24, 48, 72 నెలలలో వరుసగా రూ 250, రూ 520, రూ 820 ఇవ్వగలదు.

విదేశీ మారకముతో సహా అన్ని రకముల బ్యాంకింగ్
వ్యాపారములు నిర్వహించబడును

ఎస్. ఆర్. వై. శివరామప్రసాద్ బహదూర్,
చైర్మన్

టి. ఆర్. భా
జనరల్ మే